జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 21 | ఏప్రిల్ | 2025 • పేజీలు : 8



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**బూర్గంపహాడ్, ఏప్రిల్20, ప్రజా జ్యోతి :** బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పాత బస్తాలు ఇస్తున్నారని దానివలన ధాన్యం వృధా అవుతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి

మిగతా 2 లో...

- సరైన చట్టం లేక గతంలో ఇబ్బందులు
- హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం
- సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమం
- గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి గ్రామ పాలనాధికారి నియామకం
- భూభారతితో ఆదివాసి చట్టాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు




## భూ భారతితో రైతాంగ సమస్యలకు
# సత్వర పరిష్కారం

**ఇల్లెందు, ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంతో రైతాంగ సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యేందుకు మార్గం సుగమమైందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆదివారం మండలంలోని బొజ్జాయిగూడెంలోని ఎస్ఎస్ గార్డెన్స్ లో భూభారతిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతాంగ భూ సమస్యలు పరిష్కారానికి గతంలో సరైన చట్టం లేక రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుత భూ భారతి చట్టంతో రైతులు తమ భూ సమస్యలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఉన్న సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా భూభారతిలో అవకాశం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఆదివాసీ చట్టం సత్వర పరిష్కారానికి సులభమైన మార్గం చూపిస్తుందని తెలిపారు. ధరణి పోర్టల్ లో తప్పుల సవరణకు రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని

మిగతా 2 లో...



# వారెవ్వా.. తాటిముంజలు

- వేసవి తాపాన్ని తీర్చే ఫలాలు
- పలు ఆరోగ్య ప్రయోజనాలు

**భద్రాచలం , ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి:** నోరూరించే తాటి ముంజల సీజన్ వచ్చేసింది. ఏప్రిల్, మే నెలల్లో విరివిగా లభించే ఈ తాటి ముంజలను ప్రకృతి ప్రసాదంగా పేర్కొంటారు. వేసవి తాపాన్ని తీర్చడమే కాకుండా శరీర ఉష్ణోగ్రతలను సమతుల్యంగా ఉంచుతూ ఆరోగ్యానికి మేలు చేసే సుగుణాలు తాటి ముంజల ప్రత్యేకత. ఈ తాటి ముంజలను దుమ్ముగూడెం మండలం నుంచి తెచ్చి భద్రాచలం పట్టణంలోని ఫారెస్ట్ ఆఫీస్ ఎదురుగా విక్రయిస్తున్నారు . 50 రూ పాయలకు 10 నుంచి 15వరకు తాటి ముంజలను విక్రయిస్తున్నారు. **పోషక విలువలు అధికం..:** తాటి ముంజల్లో అనేక పోషక విలువలు ఉన్నాయి. వేసవిలో మాత్రమే లభించే ఈ తాటి ముంజలను మధుర ఫలంగానూ పేర్కొంటారు. ముంజల్లో 87 శాతం నీరు ఉంటుంది. అందులోని పోషక విలువలు వడదెబ్బ నివారణకు, శరీర ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ఉపయోగపడతాయి. తాటి ముంజల లోపటి తెల్లని పదార్థం ఎండ తాపం నుంచి రక్షిస్తుంది. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ఈ తాటి ముంజలు ప్రతి ఒక్కరూ రుచి చూడాల్సిందే.

## భూభారతి తో సమస్యలు పరిష్కారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య




**టేకులపల్లి,ఏప్రిల్20,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన భూ భారతి చట్టం –2025 అవగాహన కార్యక్రమానికి నియోజకవర్గ శాసనసభ్యులు

మిగతా 2 లో...

# భూ భారతితో రైతాంగ సమస్యలకు సత్వర పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి...)

ఇప్పుడు ఆ ఇబ్బందులు ఉండవన్నారు. భూ భారతి చట్టంపై రైతులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రిజిస్ట్రేషన్ న్యూటేషన్, సర్వే నెంబర్లు రైతులు కలిగి ఉన్న గట్టు పంచాయతీలతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం ఉండేది కాదని, ఇప్పుడు ఆ సమస్యను గ్రామ స్థాయిలోని గ్రామ పాలన అధికారి విచారణతో పరిష్కారానికి మార్గం సులభం కానున్నదని తెలిపారు. జిల్లాలో 9 లక్షలకు పైగా సాదా బైనామా పెండింగ్ కేసులు ఉన్నాయని, ఇప్పుడు భూభారతితో పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాటికి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేపట్టి రైతులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు సంబంధించి స్పష్టమైన భూభారతిలో చట్టం తీసుకొచ్చారని ఈ చట్టం ద్వారా సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్న వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు అందించే పాస్ పుస్తకాలలో రైతుకు సంబంధించిన భూమి మ్యాప్ సైతం పొందుపరచడం జరుగుతుందని, దీనివల్ల ఒకే స్థలాన్ని పలువురికి అమ్మే మోసపూరిత వ్యక్తులకు చెక్ పడనుందని తెలిపారు. భూభారతి చట్టంతో ఆదివాసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని భూ భారతి ఆదివాసి చట్టాలకు అనుగుణంగా భూభారతి పోర్టల్ ను రూపొందించడం జరిగిందని, ఆదివాసీలు ఎటువంటి అపోహలకు పోవద్దన్నారు. ధరణి పోర్టల్ వల్ల 6, 7 సంవత్సరాల నుంచి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, భూభారతితో ఆ సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు. భూభారతి పోర్టల్ పూర్తిగా ప్రభుత్వమే నిర్వహిస్తుందని, గతంలో ధరణి పోర్టలను ప్రైవేటు సంస్థ నిర్వహించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందన్నారు.





అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టం భూ భారతితో రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. భూ సంబంధిత సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, ఇటువంటివి తలెత్త కూడదనే, ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందని పేర్కొన్నారు. భూ సమస్యలు మార్పులు, చేర్పులు, మ్యుటేషన్, ఇతర సమస్యలకు ఈ భూభారతి చట్టం పరిష్కారం చూపుతుందన్నారు. ఈ చట్టం రైతు లకే మాత్రమే కాదని, ఆఫీసర్లకు కూడా ధైర్యం ఇచ్చిందని తెలిపారు. సమస్య ఎంత తీవ్రమైనదైనా నాలుగు అంచెల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ చట్టంపై రైతు లు, ప్రజలు అవగాహన కల్పించేందుకే సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు, డిఎల్పిఓ రమణ, తహసిల్దార్ కోట రవికుమార్, ఎంపీ డీఓ దన్ సింగ్, రైతులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, యువజన విభాగం, మహిళా విభాగం, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా రామయ్య నిత్యకల్యాణం





**భద్రాచలం కల్చరల్ , ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన అర్చకులు జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అభిషేకంలో పాల్గొన్న భక్తులు మురిసిపోయారు. అర్చకులు తెల్లవారుజామున సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## నేడు భద్రాద్రికి ఎమ్మెల్సీ కవిత రాక



**భద్రాచలం, ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి :** భద్రాచలంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం పర్యటించనున్నారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామి వారిని ఆమె దర్శించుకుంటారు. అనంతరం హరితహోటల్లో ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు. సమావేశం అనంతరం పర్ణశాల ఆలయాన్ని దర్శించుకుంటారు. ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా కవిత భద్రాచలం రానున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షురాలికి సన్మానం



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 20, ప్రజజజ్యోతి :** భద్రాచలం లయన్స్ క్లబ్ కు తొలి మహిళ అధ్యక్షురాలుగా ఎన్నికైన పిన్నింటి కమల రాజశేఖర్ కు ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్, బందు వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ కమల రాజశేఖర్ భద్రాచలం పట్టణంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, శివానంద ఆశ్రమంలో, చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలలో విరివిగా పాల్గొంటున్న కమల రాజా శేఖర్ కి తొలి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నిక కావడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. వారు అనేక స్వచ్ఛంద సంస్థలలో పని చేస్తూ లయన్స్ అధ్యక్షురాలుగా ఎన్నిక కావడం చాలా ఆనందదాయకమని, వారికి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కమిటీ పక్షాన ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి. ప్రసాద్ , కోశాధికారి డి కృష్ణమూర్తి , ఉపాధ్యక్షులు సుబ్బయ్య చౌదరి, సంఘం సలహాదారు మాదిరెడ్డి రామ్మోహనరావు, ఉపాధ్యక్షులు ఎస్ రాజ బాబు, నాయకులు విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, దీకొండ వెంకటేశ్వర్లు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి తో సమస్యలు పరిష్కారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య.

(మొదటి పేజీ తరువాయి...)

కోరం కనకయ్య,భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పటేల్, ఆర్డిఓ మధు , తాసిల్దార్ నాగ భవానిలు హాజరై భూ భారతి చట్టం ఉపయోగాలను రైతులకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించారు. వారు రైతులకు భూభారతి చట్టం గురించి క్లుప్తంగా వివరిస్తూ మారు మూల గ్రామాల్లో ఉన్న రైతులు, భూమి పట్టా అవ్వనటువంటి మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి వారు కోరడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ నాయకులు కోరం సురేందర్–ఉమా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దేవా నాయక్, నాయకులు ఈది గణేష్,ఇస్లావత్ రెడ్యానాయక్, మంగీలాల్, భద్రు, భూక్యా సర్దార్, బానోత్ రవి, మధురెడ్డి, నర్సింగ్ లక్ష్మయ్య, లక్కినేని శ్యామ్,బొడ్డు అశోక్, శివ, ఉదయ్, సరోజినీ, బండ్ల రజినీ –శ్రీనివాస్,సరిత,హనుమంతు,బన్సీలాల్,విజయ్,శివాజీ,సుధీప్ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, తదితర నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి...)

సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని రైతులకు భరోసానిచ్చారు. అనంతరం సారపాక సుందరయ్య నగర్ లో నూతన ఏసు క్రీస్తు ప్రార్థన మందిరానికి శంకుస్థాపన చేశారు. ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చిలో స్థానిక క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి,మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి,నాయకులు రోశిరెడ్డి,కైపు శ్రీనివాస్ రెడ్డి,బట్టా విజయ్ గాంధీ,భజన సతీష్,నాగరాజు,యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కాపాడండి

▪ పొనిశెట్టి వెంకటేశ్వర్లు



**పాల్వంచ, ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి :** పాల్వంచ పట్టణం లో చాల విలువైన ప్రభుత్వ భూములను కొందరు అమ్ముకుంటున్న స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణం లో శ్రీనగర్ కాలనీ లో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ సుమారు వందల కోట్ల విలువైన 5,6 వందల ఎకరాల ప్రభుత్వ భూములు కేవలం రెవెన్యూ కార్యాలయం లో పేపర్ల మీద తప్ప భౌతికంగా లేవు అని తెలిపారు. గతం లో రెవెన్యూ శాఖ వారు ప్రభుత్వ భూములు కాపాడాలనే ఉద్దేశం తో ఒక అధికారి పాల్వంచ ప్రభుత్వ భూములను సర్వే చేయించి వాటి అన్నిటికి ప్రభుత్వ ధనం తో పెన్సింగ్ వేసి ప్రభుత్వ స్థలం అని బోర్డు లు కూడ పెట్టారు కానీ సదరు అధికారిని వెంటనే పాల్వంచ నుండి బదిలీ చేశారు. ఆ తరువాత ప్రభుత్వ భూమిలో పాతిన బోర్డులు, పెన్సింగ్ ను కొందరు తొలగించారు. కానీ వారి మీద స్థానిక రెవెన్యూ శాఖ వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాల ఆశ్చర్యం. ఈ విషయం లో ఇది వరకు కూడ చాల సార్లు అధికారాలకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. ఒక నిరు పేద వాడు ఒక 50 గజాల స్థలం ఆపుకోని దానిలో చిన్న గుడిసె వేసుకుంటే నాన్ బెల్ కేసు పెట్టి జైలు కు పంపే అధికారులు కొందరు పెద్దలు ప్రభుత్వ భూములు యథేచ్ఛగా అమ్ముకుంటుంటే మాత్రం అటు వైపు కన్నెత్తి కూడ చూడరు. పాల్వంచ లో రాజా వారి చేపల చెరువు సినిమా ను తలపించే విధంగా భూములు మాయమౌతున్న అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్ధం కావడం లేదు అని అన్నారు. పాల్వంచ లో గతం లో పరి పాలించిన కాంగ్రెస్ & తెరాస ప్రభుత్వ హయం లో అధికారుల సహాయం లో ప్రభుత్వ భూములు మొత్తం వేరొక సర్వే నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ లు చేసి అమ్ముకున్నారు. ఈ విషయం చాల మంది ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదు. కొత్తగూడెం సబ్ రిజిస్టర్ గతం లో పని చేసిన వారు ప్రస్తుతం పని చేస్తున్న వారి పై రిజిస్టేషన్ కార్యాలయం వద్ద ఎలాంటి భూములకైనా రిజిస్టేషన్ చేయించే ఏజెంట్ల మీద విచారణ జరిపించాలి. ప్రభుత్వ భూములు ఆక్రమించి లేఔట్ లు చేసే వారికీ మున్సిపల్ అధికారులు ఇంటి నెంబర్లు ఇవ్వడం వలన ఆ ఇంటి నెంబర్ ఆధారంగా ప్రభుత్వ భూములు అమ్మకం చేశారు. కొంత మంది ఘనులు పాల్వంచ లో ముఖ్యంగా 999,817,444,727 లాంటి సర్వే నెంబరు లో 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని గతం లో పనిచేసిన జిల్లా కలెక్టర్ , రెవెన్యూ డివిజనల్ అధికారి , స్థానిక తహశీల్దార్ సర్వే చేసి రిపోర్ట్ ఇచ్చారు. కానీ అది కేవలం కాగితాలకే పరిమితం అయినది. ఆ భూములు మొత్తం అమ్ముకున్న పట్టించుకోని అధికారులు పాల్వంచ నవభారత్ లో సాక్షాత్తు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు 444 సర్వే నంబర్ లో ఉన్న ప్రభుత్వ భూమి ప్లాట్లు చేసి అమ్ముతుంటే ఈ విషయాలు చాల సార్లు పత్రికల్లో వచ్చిన స్థానిక అధికారులు మాత్రం ఆ స్థలాల జోలికి పోవకపోవడం చాల అనుమానాలకు తావు ఇస్తుంది. భవిషత్ తరాల అవసరాలకు ప్రభుత్వ భూమి ఎంతో అవసరం అని ఇప్పడికైనా ప్రభుత్వ భూములు ఎక్కడ ఎక్కడ ఉన్నాయో పూర్తి గా సర్వే చేసి ఆ భూములన్నీ స్వాధీనం చేసుకోవాలని బీజేపీ పార్టీ తరుపున డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములకు రిజిస్టేషన్ చేసిన రిజిస్టేషన్ అధికారుల మీద, వారికీ సహకరించిన మున్సిపల్ అధికారుల మీద విచారణ జరపాలి. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. పాల్వంచ లో ఇల్లు లేని సుమారు 3500 పేద కుటుంబాల వారు గత ప్రభుత్వం లో డబుల్ బెడ్ రూమ్ ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాంటి ఇల్లు లేని పేద వారికీ కుటుంబానికి ఒక వంద గజాల స్థలం ఇవ్వాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో భట్టు నరేష్, మాదారపు లక్ష్మణ్, ధరావత్ నరేష్, మాలోత్ ప్రశాంత్, పవన్, కిరణ్, కిట్టు , భట్టు అశోక్, రెడ్డి లు పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు



**టేకులపల్లి, ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి :** మండలంలోని సులానగర్ ఆర్సిఎం చర్చిలో ఫాదర్ మార్నేని అర్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా ఈస్టర్ వేడుకలునిర్వహించారు. దేవాలయంలో ఫాదర్ మార్నేని అర్లయ్య ప్రత్యేక ప్రార్ధనలు చేస్తూ వాక్యాన్ని బోధిస్తూ నేడు ఏసు క్రీస్తు సమాధి నుంచి సజీవుడై పునరుత్థానం చెందిన దినం అని, హింస ద్వేషాలు మరణాన్ని ఇస్తాయని, ప్రేమా , క్షమాపణలు జీవితానికి నూతనత్వాన్ని ఇస్తాయని, ఇది నిరూపించడానికె సమాధి నుంచి సజీవుడై తిరిగి వచ్చాడు క్రీస్తు అని అన్నారు. అనంతరం ఆలయంలో కేక్ కట్ చేసి కొవ్వొత్తులు వెలిగిస్తూ భక్తులు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఈస్టర్ ఫుడ్ స్వీకరించారు.

## ఘనంగా చంద్రబాబు 75 వ జన్మదిన వేడుకలు



**టేకులపల్లి, ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి :** టేకులపల్లి టిడిపి మండల అధ్యక్షులు గుడిపూడి మోహన్ రావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిపూడి మోహన్ రావు కేక్ కట్ చేసి, చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అభిమానులకు, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు గోరంట్ల రవి, అనుగోజ్ నటరాజ్, మూడ్ కుమార్, రాయల రాజేష్, రాయల ఉద్యాన్ , మూడ్ కృష్ణ, తోటకూరి శ్రీనివాసరావు, బాలు, రాజేష్ , పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే కోరం



**టేకులపల్లి, ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్రావు ఆధ్వర్యంలో టేకులపల్లి సబ్ యార్డ్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. ప్రభుత్వ మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలని రైతులకు సూచించారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ లక్కినని సురేందర్రావు, ఏడిఏ లాల్చంద్, మండల ఏవో అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు



**ఇల్లందు, ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి , తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద టిడిపి నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. 28 ఏళ్లకే మంత్రిగా, 9 సంవత్సరాల 9 నెలలు ముఖ్యమంత్రిగా, 13 సంవత్సరాలు ప్రతిపక్షనేతగా ఇటు రాష్ట్రంలోనూ సేవలందించిన చంద్రబాబు నాయుడు తన విజన్ తో ఉమ్మడి రాష్ట్రాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 60 శాతం ఆదాయం వస్తున్న హైదరాబాద్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది చంద్రబాబు నాయుడు అన్నారు. ఆనాడు హైదరాబాదును ప్రపంచ పటంలో నిలిపిన ఘనత చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని, ఎన్నో అంతర్జాతీయ కంపెనీల హైదరాబాదులో తీసుకురావడంలో చంద్రబాబు నాయుడు పాత్ర కీలకమని స్పష్టం చేశారు. ఎంతో ఓర్పు, నేర్పుతో నేటి రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శమని, అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న ఎంతో క్రమశిక్షణతో ఉంటారన్నారు. రానున్న కాలంలో తెలంగాణ రాష్ట్రంలో సైతం టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కారు నర్శన్న, శ్యామ్ తీవారి, అయ్యోరి, ముల్కలపల్లి నాగేశ్వరరావు, పుచ్చకాయల సత్య నారాయణ, చిలిమల బాబు, కంది రవి, భాస్కరావు, దేశవత్ శ్రీహరి, దాసరి గోపాలకృష్ణ, గోగ్గేల రాజేష్, మాటేలా రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్



**భద్రాచలం, ఏప్రిల్ 20, ప్రజాజ్యోతి :** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగే గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏలోని సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ జరుగుతుందని, గిరిజనులు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.